ఈనాడు
చిత్తూరు
ఆదివారం 20 ఆగస్టు 2017 20 పేజీలు

# పంచాయతీరాజ్ సంస్థలతో దేశాభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు రామచంద్రారెడ్డి



సదస్సుకు హాజరైన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

**తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** పంచాయతీరాజ్ సంస్థలు ఆర్థిక ప్రగతి సాధిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని రాజీవ్‌గాంధీ జాతీయ యువత పురోభివృద్ధి సంస్థ సంచాలకుడు ఆచార్య మదన్‌మోహన్ గోయల్ పేర్కొన్నారు. స్థానిక హోటల్ బ్లిస్ వేదికగా భారత గ్రామీణ అధ్యయనం- పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో '25 సంవత్సరాల తదనంతరం పంచాయతీరాజ్ సంస్థల సమస్యలు, 73వ రాజ్యాంగ సవరణ చట్టం ముందున్న సవాళ్లు' అనే అంశంపై శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య గోయల్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ విధానం అమలు నేపథ్యంలో పంచాయతీరాజ్ సంస్థల ఆర్థిక వనరుల కేటాయింపు అధిక ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయన్నారు. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు వివిధ స్థాయిల్లో ఎంపికైన ప్రజాప్రతినిధులు సమర్థ నాయకత్వం, జవాబుదారీతనం, పారదర్శకత అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే సుపరిపాలన సాధ్యమన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు పోలిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎమ్మెల్యేలు, ఎంపీలు సభ్యులుగా ఉండటంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా ఉన్నారన్నారు. భవిష్యత్తులో గ్రామ పంచాయతీల బలోపేతంతోనే దేశం అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక, ఆర్థిక సంస్థ బెంగళూరు ఆచార్యులు డాక్టర్ డి.రాజశేఖర్, ఎస్.శివన్న, దేవేంద్రబాబు, రంజిత్ సింగ్‌సోధి, కె.గిరీశన్, రంగారెడ్డి, డి.సోమశేఖరం, హిరణ్మయ లేఖ్, డాక్టర్ మల్లప్ప, నారాయణ, డాక్టర్ మంజుల, డాక్టర్ రేవాంకర్, అగ్రశ్రీ వ్యవస్థాపకులు డాక్టర్ డి.సుందరరామ్, భారతి సుందర్ పాల్గొన్నారు.

**నేడు ముగింపు సమావేశం:** జాతీయ సదస్సు ముగింపు సమావేశం ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని అగ్రశ్రీ వ్యవస్థాపకులు డాక్టర్ డి.సుందరరామ్ తెలిపారు. ఇందులో భాగంగా ఏడు రంగాల్లో ఎంపికైన ప్రముఖులకు రాజీవ్‌గాంధీ జాతీయ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ పాల్గొననున్నట్లు తెలిపారు.